www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శుక్రవారం | 19 | జూన్ | 2026 పేజీలు : 8

## విద్యార్థులు లేని పాఠశాల







2 లో

## వినతుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ




**అధికారులు సమస్యలపై దృష్టిసారించాలి - ఎంఎల్ఏ కూనంనేని**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు అధికార యంత్రాంగాన్ని,స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ప్రజలకు చేరువ చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మన కోసం మన ఎంఎల్ఏ కార్యక్రమంలో భాగంగా గురువారం పాల్వంచ మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజలలో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. పలు శాఖల అధికారులు, వివిధ ప్రాంతాల్లోని లబ్దిదారులు , ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలను ఎంఎల్ఏకు వివరించారు. అక్కడే ఉన్న అధికారులు వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ అధికారులను ప్రజల చెంతకు చేర్చేందుకు తాము ముఖాముఖి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. దీని ద్వారా ప్రజా సమస్యలు నేరుగా తెలుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రజల నుండి వచ్చిన వినతులపై అధికారులు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. ఆర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని

మిగతా 2లో..

## రక్త పరీక్షల పేరుతో భారీ దందా..!

-అర్హత లేకుండానే రక్త పరీక్షలు
-చిన్న తప్పుడు రిపోర్ట్‌తో రోగి ప్రాణానికే ప్రమాదం?
-రెచ్చిపోతున్న కేంద్రాలు
-అధికారుల చర్యలు నామమాత్రమే..



సెంటర్‌స్ప్రెడ్

## ఎరువుల దుకాణాలపై పోలీసుల తనిఖీలు




**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడటంతో పాటు నకిలీ విత్తనాలు, పురుగుమందుల విక్రయాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా ఎరువుల దుకాణాలపై గురువారం దాడులు నిర్వహించినట్లు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. జిల్లా కేంద్రం ఖమ్మంతో పాటు సత్తుపల్లి, వైరా, తల్లాడ, చింతకాని, కామేపల్లి, తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్ల పరిధిలో తనిఖీలు చేపట్టారు.

మిగతా 2లో..

## రూ. 50 వేలు కొట్టు..

# ఇందిరమ్మ ఇల్లు పట్టు...!




-ఇందిరమ్మ ఇళ్ల కోసం.. నాయకుల పైరవీలు షురూ..
-కాసుల వర్షం కురిపిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు
-డబ్బులిస్తే అనర్హులు.. అర్హులుగా ఎంపిక
-ఆధారాలు లేకుండా జాగ్రత్త పడుతున్న పైరవీకారులు

**ప్రజాపక్షం/జూలూరుపాడుః** ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం ప్రారంభించినా అది తమ స్వలాభం కోసమే మార్చుకుంటున్నారు అధికార పార్టీ పైరవీకారులు. పేద ప్రజల ప్రయోజనమే లక్ష్యంగా ఏ పథకాన్ని అనౌన్స్ చేసినా, అది అమల్లోకి రాకముందే దళారులు బిజినెస్ స్టార్ట్ చేస్తున్నారు. మీకు అర్హత ఉన్నా లేకున్నా మేం మీకు పథకంలో స్థానం కలిగేలా చేస్తాం. మాకెంతిస్తావ్ అంటూ బేరాలు మాట్లాడేసుకుంటున్నారు. పదేళ్ల తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరి పాలన సాగుతుంది. ఈ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పట్టా లెక్కి మొదటి విడత దిగ్విజయంగా పూర్తి చేసుకుంటుంది. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హుల ఎంపిక కోసం అధికారులు సర్వేను

మిగతా 2లో..

## ఫైనాన్స్ సంస్థలపై ఇంటెలిజెన్స్ నిఘా..!

-పెట్టుబడి పెడుతున్న వారి వివరాలు సేకరణ
-డాక్యుమెంట్ రైటర్ల పాత్రపై రహస్య విచారణ
-పట్టణంలోని 13 కంపెనీల సిబ్బంది కదలికలను గమనిస్తున్న నిఘా వర్గాలు



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** నియోజకవర్గంలో హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల కార్యకలాపాలపై ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని రుణాల పేరుతో జరుగుతున్న అక్రమాలపై వెలువడుతున్న కథనాల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. నూజివీడు, విస్సన్నపేట, తిరువూరు, సత్తుపల్లి, బేతుపల్లికి చెందిన కొందరు వ్యక్తులు ఎసైన్డ్ భూముల్లో నిర్మితమైన ఇళ్లకు రుణాలు ఇప్పించేందుకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు సమాచారం సేకరిస్తున్నారు. రుణాల మంజూరులో కీలక పాత్ర పోషిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు, ప్రైవేట్ వ్యక్తుల వ్యవహార శైలిపై కూడా రహస్య విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. సత్తుపల్లి, తిరువూరు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఫిన్‌కేర్, ఫైవ్ స్టార్, చోళ, ఆప్టాస్, వెరిటాస్, ఐఐఎఫ్ఎల్, ధన్‌మిత్ర, నేస్తావియా, ఎస్‌బీఎఫ్‌సీ, డీసీబీ, కాప్రీ, సుందరం, మణప్పురం తదితర హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల సిబ్బంది కదలికలను నిఘా వర్గాలు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. రుణాల మంజూరు ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘన జరిగిందా...? , అర్హత లేని ఆస్తులకు రుణాలు మంజూరయ్యాయా..?, మధ్యవర్తుల ప్రమేయం ఎంత మేర ఉంది...? అనే అంశాలపై సమాచార సేకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, కల్లూరు సబ్ కలెక్టర్ స్థాయిలో కూడా వివరాలు కోరినట్లు సమాచారం. అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని అధికారులు సంకేతాలు ఇస్తుండగా, ఫైనాన్స్ సంస్థల వ్యవహారాలపై నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ సాగుతోంది. అధికారులు చేపట్టిన విచారణతో సంబంధిత వర్గాల్లో ఆందోళన నెలకొంది.

# వినతుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

అధికారులను ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. మౌళిక వసతుల కల్పనతోనే బస్తీలు, గ్రామాలు సమగ్రాభివృద్ధి చెందుతాయని, ఆ దిశగా నియోజకవర్గ వ్యాప్తంగా మౌళిక సదుపాయాలు కొరత లేకుండా చూసేందుకు నిరంతరం పర్యవేక్షిస్తామని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని, ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్దిదారులకు చేరినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని, ప్రజలు ఆశలు నెరవేరుతాయన్నారు. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా దర్బార్ తరహాలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కూనంనేని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా వీసంశెట్టి పూర్ణ చంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్ తహశిల్దార్ దారా ప్రసాద్ ఇంచార్జ్



కమీషనర్ విజయానంద్ ఎలక్ట్రికల్ ఏడిఇ అబ్దుల్ రెహమాన్, ఎస్ఐ తోట నాగరాజు, ఆబ్కారీ సిఐ ప్రసాద్, ఎంపిడిఓ, అటవీ అధికారులు, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు గుర్రం వెంకటేశ్వర్లు నామా కీర్తి గొర్లె అన్నపూర్ణ చెరుకు భాగ్యలక్ష్మి కాల్వ భాస్కర్ దున్నపోతుల మణి వి భవిత దంతబోయిన నరేష్‌తో పాటు వి పద్మజ డి సుధాకర్ అన్నారపు వెంకటేశ్వర్లు నిమ్మల రాంబాబు శెనగారపు శ్రీనివాసరావు ఏస్ఏ రెహమాన్ వైఎస్ గిరి గౌస్ పాషా మస్తాన్ అహ్మద్ జానీ కరీం గొర్లె నరేష్ నామ పండు ఆలపాటి ప్రసాద్ అల్లి వెంకటేశ్వర్లు వివిధ శాఖల డిఇలు ఏఇలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 50 వేలు కొట్టు.. ఇందిరమ్మ ఇల్లు పట్టు...!

(మొదటిపేజీ తరువాయి)

కూడా పూర్తి చేశారు. అర్హుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరిస్తామని, ప్రభుత్వం రూపొందించిన నిబంధనల ప్రకారం అర్హులనే ఎంపిక చేస్తామని, పైరవీలకు తావివ్వమని అధికారులు, మంత్రులు కూడా చెప్పారు. కానీ, క్షేత్ర స్థాయిలో సీన్ మరోలా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామంటూ పలువురి వద్ద కొందరు అధికార పార్టీ నాయకులు అడ్వాన్స్ కూడా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చే రూ.5 లక్షల్లో 10 శాతం కమిషన్ మాట్లాడుకుంటున్నట్టుగా సమాచారం. ఇప్పటికే వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు, బేతాలపాడు, గుండెపుడి, కొమ్ముగూడెం, గ్రామాలలో కొందరి నుంచి పలువురు పైరవీకారులు, నాయకులు అందిన కాడికి ఆద్వాన్స్ డబ్బులు కూడా తీసుకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది.

### ఓ పక్క సర్వే పూర్తి.. మరో పక్క పైరవీలు..

నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం కమిటీలను ఏర్పాటు చేసింది. అర్హుల ఎంపిక కోసం అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో సర్వేలో కూడా పూర్తి వివరాలు సేకరించారు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు కూడా క్షేత్ర స్థాయిలో జరిగిన సర్వేను పరిశీలించారు. ఓపక్క సర్వే పూర్తి అయిన మరో పక్క గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన చోటా మోటా నాయకులు, పైరవీకారులు ఇందిరమ్మ ఇళ్ల ఆశావహులకు ఇళ్ల ఆశ చూపి బేరాలు మాట్లాడుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామంటూ పలువురి వద్ద కొందరు అధికార పార్టీ నాయకులు అడ్వాన్స్ కూడా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చే రూ.5 లక్షల్లో 10 శాతం కమిషన్ మాట్లాడుకుంటున్నట్లు సమాచారం.

### సంక్షేమ పథకాలు లబ్ధి పొందాలంటే నాయకుల పెత్తనం ఉండాల్సిందే...

ప్రభుత్వం నుండి ఎలాంటి ప్రయోజనం పొందాలన్నా అధికార పార్టీ నియోజకవర్గ స్థాయి నుండి గ్రామస్థాయి పెత్తనం ఉండటంతో అంతా వారి కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు చెప్పుకుంటున్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లిప్పిస్తామంటూ నాయకులు పార్టీలో కొంత మంది ఆశావహులకు నమ్మబలుకుతున్నట్లు చెపుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో కొందరి నుంచి పలువురు పైరవీకారులు, నాయకులు అందిన కాడికి అడ్వాన్స్ డబ్బులు కూడా తీసుకున్నట్లు వే టూ న్యూస్ లో కథనం వెలు వడటంతో నాయకులు. డబ్బులు ఇచ్చినట్లు కానీ, కానీ, తీసుకున్నట్లు కానీ ఎలాంటి రాతపూర్వక ఆధారాలు లేకుండా పైరవీకారులు జాగ్రత్తలు పడుతున్నారు.

### ఎమ్మెల్యేకు తెలుసా.? తెలీదా..??

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మండల అనుచరుల సహాయం సహకారాలతో ఎమ్మెల్యే సైతం తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారా.? ఏకంగా ఒక్కో ఇందిరమ్మ ఇంటికి 50 వేలు వసూలు చేస్తున్నారు.? ఇందిర ఇళ్ల ఎంపిక ఇందిరమ్మ కమిటీ చేతిలో ఉండడంతో, కొంతమంది అనర్హులు. అర్హులుగా, పార్టీ నాయకులే లబ్ధిదారులను ముందు వరుసలో అర్హులుగా ఉంచుతున్నారు. అలాగే రెండో విడత ఎమ్మెల్యేల అనుచరులు సైతం. ఐదు లక్షలు ఫ్రీగా వస్తే. పార్టీకోసం ఫండ్ యాభై వేలు కూడా ఇవ్వరా' అనిఅని వసూలు చేస్తున్నారని వినికిడి.

### సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వే టూ న్యూస్ కథనం...

50 వేలు కొట్టు.. ఇందిరమ్మ ఇల్లు పట్టు వైరల్ అవుతున్న వే..టూ న్యూస్..జూలూరుపాడు మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అధికార పార్టీ నాయకులకు కాసుల వర్షం కురిపిస్తోంది. క్షేత్రస్థాయిలో సర్వే సాగుతుండగానే, ఇల్లు కావాలంటే రూ.50 వేలు ఇవ్వాలని, తక్షణమే జాబితాలో పేరు చేరుస్తామని పలువురు లబ్ధిదారులను డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దందాపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతుండగా, లబ్ధిదారులు అధికార పార్టీ నేతల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులు లేని పాఠశాల

ప్రజాపక్షం/ఏన్కూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్న పరిస్థితులకు అద్దం పడే ఘటన ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం శ్రీరామగిరి గ్రామం లో వెలుగు చూసింది. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఈ విద్యా సంవత్సరంలో ఒక్క విద్యార్థి కూడా లేకుండా కొనసాగుతుండటం చర్చనీయాంశంగా మా రింది. గత విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో కేవ లం ఒకే ఒక్క విద్యార్థి విద్యను అభ్యసించగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆ విద్యార్థి కూడా లేకపోవడంతో పాఠశాల పూర్తిగా విద్యార్థుల్లేని స్థితికి చేరుకుంది. దీంతో ప్రతి రోజూ ఉపాధ్యాయురాలు మాత్రమే పాఠశాలకు హాజరవుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి, ఉపాధ్యాయురాలు కలిసి ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరిచినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదని తెలుస్తోంది. పిల్లలు లేని పాఠశాలలో చేర్పించడం కంటే ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తామని తల్లిదండ్రులు చెబుతున్నట్లు ఉపాధ్యాయురాలు తెలిపారు. ఈ విషయమైన మండల విద్యాశాఖ అధికారి వాసవి దేవిని వివరణ కోరగా, పరిస్థితిని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. విద్యార్థులు లేక పాఠశాల కొనసాగుతున్న ఈ పరిస్థితిపై విద్యాశాఖ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సి ఉంది.

# ఎరువుల దుకాణాలపై పోలీసుల తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)


స్టాక్ వివరాలకు సంబంధించిన రికార్డులు, లైసెన్స్‌లు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను పరిశీలించారు. ప్రభుత్వ నిభందనల మేరకు క్రయవిక్రయాలు జరుగుతున్నాయా లేదా అనే విషయాలను ఆరాతీశారు. ప్యాకెట్లపై ఉన్న వివరాలు, తయారీ, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు తదితర అంశాలను పరిశీలించారు. నకిలీ విత్తనాలు, నాసిరకం పురుగుమందులతో రైతులను మోసంచేస్తే దుకాణదారులపై కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. బిల్లులు లేకపోతే భవిషత్తులో పంటనష్టపోతే సంబంధిత దుకాణదారుడిపై చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని తెలిపారు. నకిలీ, అనుమానాస్పదంగా విత్తనాలు, ఎరువులు విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే మండల వ్యవసాయ శాఖాధికారులు, సమీప పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు. ఈ దాడుల్లో ఆయా స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష కేంద్రాల వద్ద బిఎన్ఎస్ఎస్ 163 యాక్ట్ అమలు : సిపి

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : కమిషనరేట్ పరిధిలో ఈ నెల 21వ తేదీన జరుగనున్న నీట్ (యూజీ) పరీక్ష కేంద్రాల వద్ద మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 7.15 వరకు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ 2023 (భారతీయ నాగరిక్ సురాక్షా సహిత) అమలులో ఉంటుందని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాలకు రెండు వందల మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి ఎక్కువ మంది గుంపులు గుంపులుగా సంచరించడం నిషేధమని తెలిపారు. సభలు, సమావేశాలు, మైక్‌ప్రచారాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ , జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరీక్షకు ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా ఈ యాక్ట్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, పార్టీలు, సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తుతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణతీరు అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు నిఘా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు సిపి తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలు మూసివేతకు సిద్ధం..?

ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పలు గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేనందున మరో కొద్ది రోజుల్లో మూసివేయున్నట్లు ఉపాధ్యాయ సంఘా ల్లో చర్చలు కొనసాగుతున్నవి. మండల పరిధిలోని విశ్వనాథపురం, పాయపూర్, బత్తులపల్లి హరిజనవాడ, ప్రాథమిక పాఠశాల పేరువంచ, రఘునాథగూడెం తదితర పాఠశాలలు విద్యార్థుల కొరతతో




మూతకు సిద్ధమైనట్లు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. ఆయా గ్రామాలలో ఇద్దరు ముగ్గురు నలుగురు మాత్రమే ఉండటంతో మూసివేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. విద్యార్థుల సంఖ్య పెరగనిచో చేసేదేమీ లేక ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించి గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి మూసి వేసేందుకు సిద్ధంగా ఉన్నామని అదే విధంగా గ్రామాల్లో గ్రామస్తులు చైతన్యవంతం అయితేనే ప్రభుత్వ పాఠశాల లు నిలబడతాయని ఎంఈఓ నివేదిత తెలిపారు. ప్రభుత్వ నడిపేందుకు సిద్ధంగా ఉన్నా కూడా విద్యార్థులు సంఖ్య పెరగనందున తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వ బడులు సిద్ధంగా ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

# విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టుసాధించాలి

ప్రజాపక్షం/భద్రాచలం : విద్యార్థులు చదువులతో పాటు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆచార్య జాన్ మిల్టన్ సూచించారు. గురువారం కళాశాల అనుబంధ మెంటర్షిషిప్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సి, డిజిటల్ లెర్నింగ్ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సం. 5వ సెమెస్టర్‌లో భాగంగా తృతీయ సం. విద్యార్థులకు ఇంటర్నల్‌షిప్ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ శ్రద్ధ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ డిజిటల్ లెర్నింగ్ పరిజ్ఞాన వినియోగంపై విద్యార్థినీ విద్యార్థులకు బుధ,గురువారాలు శిక్షణ అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐక్సా ఏసి కో ఆర్డినేటర్ హవీలా అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల కన్నా విద్యా దానమే గొప్పది



ప్రజాపక్షం/ఎర్రుపాలెం: అన్ని ధానాల కన్నా విద్యా ధానం గొప్పదని, విద్యను అన్నదమ్ములు పంచుకోలేరు, దొంగతనం చేయలేరని సర్పంచి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వెంకటాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలను పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. నేడు పేద విద్యార్థుల కోసం ఉన్న వసతులు ఆనాడు మాకు లేవని, వసతులు లేకనే మేము చదువుకోలేక పోయామని, ప్రస్తుతం ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సదుపాయాలు ఉచితంగా అందిస్తోందని, మంచిగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అనంతరం మండలంలోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలకలు, బలపాలు, పెన్సిళ్ల పంపిణీ చేశారు.

# సర్పంచ్, సెక్రటరీపై కాంట్రాక్టర్ దౌర్జన్యం

### - వివాదాస్పదంగా మారిన ఈజీఎస్ నిధులతో టాయిలెట్ నిర్మాణం

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలంలోని తీర్థాల గ్రామపంచాయతీలో సర్పంచ్, సెక్రటరీపై ఓ కాంట్రాక్టర్ దౌర్జన్యానికి పాల్పడ్డారనే ఆరోపణలు స్థానికంగా గురువారం చర్చనీయాంశంగా మారాయి. పంచాయతీ పరిధిలో చేపట్టిన



అభివృద్ధి పనుల విషయంలో ఏర్పడిన విభేదాలు చివరకు పరస్పర ఆరోపణలకు దారితీసినట్లు తెలిసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈజీఎస్(ఉపాధిహామీ) పర్యవేక్షణ లేదా ఇతర అంశాలపై తలెత్తిన విభేదాల నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్టర్ సర్పంచ్, సెక్రటరీతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ తీవ్ర పదజాలంతో దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని, సమస్యను తేలికగా తీసుకున్నారని సంబంధిత వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అయితే ఈ విషయంపై కార్యదర్శిని వివరణ కోరగా..వివాదం జరిగిన మాట వాస్తవమేనని, అది సర్పంచ్‌తో జరిగిందన్నారు. ఈ క్రమంలో సదరు వ్యక్తి నాపై సైతం ఇష్టానుసారంగా చిందులు వేశారన్నారు.

# ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి



**-భూ సేకరణపై కలెక్టర్‌తో కలిసి సమీక్షించిన కమిషనర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో నీటి పారుదల ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్అండ్ఆర్, ఇరిగేషన్ భూసేకరణ కమిషనర్ కె. శివకుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి కమిషనర్ కె. శివకుమార్ నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిపై ప్రాజెక్టుల వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో ఉన్న పెండింగ్ అంశాలను వేగవంతంగా పరిష్కరించి భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సమీక్ష సందర్భంగా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, మున్నేరు పాలేరు లింక్ కాలువతో పాటు ఉమ్మడి ఖమ్మంజిల్లాలో కొనసాగుతున్న ఇతర సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించారు. భూసేకరణ, అటవీ అనుమతులు, పరిహారం చెల్లింపులు, పెండింగ్ కోర్టు కేసులు, సర్వే పనుల స్థితిగతులపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, అవార్డుల జారీ, చెల్లింపుల ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టిసారించాలని కమిషనర్ తెలిపారు. కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లాలో పురోగతిలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి 11 గ్రామాల్లో 193.15 ఎకరాల భూసేకరణ అవార్డు దశలో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి 14వ ప్యాకేజీ క్రింద 650.22 ఎకరాల భూసేకరణలో 623.02 ఎకరాలకు అవార్డు పాసు చేసినట్లు తెలిపారు. 15వ ప్యాకేజీకి సంబంధించి 198.13 ఎకరాల భూసేకరణకు గాను అవార్డు పాసు చేసి నిర్వాసితులకు పరిహారం చెల్లించామన్నారు. ప్యాకేజీ 16కు సంబంధించి 820.12 ఎకరాలకు గాను అవార్డు పాసు చేసినట్లు, 796.13 ఎకరాలకు పరిహారం చెల్లింపు పూర్తి చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్యాకేజీ 6,2, 1లకు సంబంధించి భూసేకరణ పురోగతిలో ఉందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఇరిగేషన్ సీఈలు ఎం. వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎస్‌డిసి సదానందం, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఆశ్రయితులకు ఆధార్ నమోదు

**-గుర్తింపు, గౌరవప్రద జీవనానికి కొత్త ఆశలు**
**-జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి దేవి మానస**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నిరాశ్రయులు, అనాథలు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు ఆశ్రయం కల్పిస్తున్న అన్నం సేవా ఫౌండేషన్‌లో గురువారం ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరం ఆశ్రయితుల జీవితాల్లో కొత్త ఆశలు నింపింది. గుర్తింపు, సంక్షేమ సేవల ప్రాప్తి, కుటుంబాలతో పునరేకీకరణకు ఈ కార్యక్రమం దోహదపడనుంది. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ (టిఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి పంచాక్షరి ఆదేశాలు, జిల్లా న్యాయ సేవా సంస్థ గౌరవాధ్యక్షులు (ఇన్‌చార్జ్), జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా॥ జివి మహేష్‌నాథ్ మార్గ దర్శకత్వంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి. దేవిమానస అన్నం సేవా ఫౌండేషన్‌ను సందర్శించి ఆశ్రయితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. ఆశ్రయితులలో చాలా మందికి గుర్తింపు పత్రాలు లేకపోవడం వల్ల సంక్షేమ సేవలు, ఇతర ప్రయోజనాలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాలను గుర్తించిన జిల్లా న్యాయ సేవా సంస్థ, జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి ఆశ్రమంలో ప్రత్యేక ఆధార్ శిబిరం నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక శిబిర నిర్వహణకు సహకరించారు. శిబిరంలో ఆశ్రయితుల బయోమెట్రిక్ వివరాలు నమోదు చేసి ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టారు. ఇప్పటికే గతంలో ఆధార్ పొందిన వారి వివరాలు గుర్తించబడితే వాటిని తిరిగి పొందెందుకు చర్యలు తీసుకోనున్నారు. అటువంటి వివరాలు లభించని పక్షంలో వారి అసలు గుర్తింపు నిర్ధారించి కుటుంబ సభ్యులను గుర్తించే అవకాశం ఉంటుంది. కుటుంబ వివరాలు లభించిన వారికి పునరేకీకరణ దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వివరాలు లభించని వారికి కొత్త ఆధార్ కార్డులు జారీ చేయనున్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి. దేవిమానస మాట్లాడుతూ గుర్తింపు పత్రం అనేది కేవలం ఒక కార్డు మాత్రమే కాదు సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న వ్యక్తులకు అది గౌరవప్రదమైన జీవనం, సంక్షేమ సేవలు, న్యాయ పరిరక్షణకు ద్వారంగా నిలుస్తుందని తెలిపారు. ఆధార్ నమోదు పూర్తయిన అనంతరం జాతీయ న్యాయ సేవా సంస్థ (ఎన్ఏఎల్ఎస్ఏ)అమలు చేస్తున్న నిరాశ్రయులు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు, సామాజికంగా విస్మరించబడిన వర్గాలు, పేదరికంలో జీవిస్తున్న వారికి సంబంధించిన వివిధ న్యాయ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశ్రయితులకు అందేలా తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కులో గౌరవ ప్రదంగా జీవించే హక్కు కూడా అంతర్భాగమేనని సమాజంలోని అత్యంత బలహీన వర్గాలకు న్యాయ సాయం, సంక్షేమ అవకాశాలు చేరేలా చూడటం న్యాయ సేవా సంస్థల బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

# ఎరువులు, విత్తనాల దుకాణాలపై ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు నకిలీ విత్తనాలు, పురుగు మందుల విక్రయాలను అరికట్టేందుకు సత్తుపల్లి పట్టణంలో పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు గురువారం పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి, వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏవో సుజాత ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలు, నవతా ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు పరిశీలించారు. అలాగే విత్తనాలు, ఎరువుల ప్యాకెట్లపై ఉన్న తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ వివరాలు తదితర అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులను మోసం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు లేదా నాసిరకం పురుగుమందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. వ్యవసాయ సీజన్‌లో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. బిల్లు లేకుండా కొనుగోలు చేసిన వస్తువులకు సంబంధించి భవిష్యత్తులో సమస్యలు తలెత్తితే చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని పేర్కొన్నారు. అనుమానాస్పదంగా కనిపించే విత్తనాలు, ఎరువుల గురించి వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని రైతులకు సూచించారు.



# సిఎం సభా స్థలి పరిశీలన



**ప్రజాపక్షం/చింతకాని :** సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 26న మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో సభ నిర్వహించేందుకు మండలంలోని రామకృష్ణాపురం, లచ్చగూడెం, మత్కేపల్లి ప్రదేశాలను జిల్లా కలెక్టర్ దివాకరన్ గురువారం పరిశీలించారు. రవాణా కనెక్టివిటీ, వీఐపీ కాన్వాయ్, హెలీప్యాడ్ వంటి అంశాలను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీవో రాంబాబు, తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, సిఐ వెంకటప్రసాద్, ఎస్సై జి నరేష్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, ఆత్మ కమిటీ డైరెక్టర్లు కొప్పుల గోవిందరావు, మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ , నాయకులు గాదె రామారావు ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/చింతకాని :** నకిలీ విత్తనాలు అమ్మితే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని మధిర ఏడిఏ వాణిశ్రీ పేర్కొన్నారు. గురువారం చింతకాని మండలంలో పలు విత్తన దుకాణాలు టాస్క్ ఫోర్స్ టీమ్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానాకాలం సీజన్ సమీపిస్తుండటంతో విత్తన డీలర్లు స్టాక్ ఇన్వాయిస్‌లు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలన్నారు. స్టాక్ రిజిస్టర్ తప్పని సరిగా నమోదు చేస్తుండాలన్నారు. స్టాక్ బోర్డు తెలుగులో రాయాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి లైసెన్సు లేకుండా ఎవరైనా విత్తనాలు, ఎరువులు అమ్మితే సమీప వ్యవసాయాధికారికి కానీ పోలీసు వారికి గాని సమాచారమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైరా సిఐ వెంకటప్రసాద్, చింతకాని ఎస్ఐ జి నరేష్, ఏవో మానస , వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు సంబంధించి ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. గురువారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మండల కమిటీ ఎంపిడివో అశోక్‌కుమార్, తహసీల్దార్ శ్వేత, ఎంఈవో రాములు ఆధ్వర్యంలో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ధృవపత్రాలను పరిశీలించారు. ఈ ఏడాది ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు మండలంలో ఐదు పాఠశాలలు చిమ్మపుడి, మంచుకొండ, రాంక్యాతండా, చింతగుర్తి, గణేశ్వరం గ్రామాల్లో మంజూరయ్యాయి. వాటిలో ఒక ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించారు. వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రాములు మాట్లాడుతూ ఐదు గ్రామాల్లోని పాఠశాలల్లో మంజూరైన ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు సంబంధించి ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు 95 మంది, ఆయా పోస్టులకు 29 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంఈవో తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం ఒక్కో పోస్టుకు ముగ్గురిని తుది ఇంటర్వ్యూకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వారికి ఆర్డీవో ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించి పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందని ఎంఈవో తెలిపారు.

# మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పిఎంశ్రీ రఘునాథపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి, మండల ప్రత్యేక అధికారి మహమ్మద్ ముజాహిద్ పరిశీలించారు. గురువారం పాఠశాలను స్పెషల్ ఆఫీసర్ ముజాహిద్ సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు, భోజనశాలను పరిశీలించి పరిశుభ్రత పట్ల ఎండిఎం ఏజెన్సీ సభ్యులను అభినందించారు. హెచ్ఎం ఎం. వెంకటేశ్వర్లు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వివరాలను స్పెషల్ ఆఫీసర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ముజాహిద్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించినవిధంగా విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని తెలిపారు. పాఠశాలతో పాటు వంట గది, భోజన శాల పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఎండిఎం ఏజెన్సీలకు సూచించారు.

# రద్దీగా మారిన పుస్తకాల దుకాణాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని పలు పుస్తకాల దుకాణాలలో విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో దుకాణాలు రద్దీగా మారాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రారంభం కావడంతో మండల పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి రాత పుస్తకాలు పెన్నులు, పెన్సిళ్లు, బ్యాగులు, అన్నం బాక్సులు, బూట్లు, విద్యార్థులకు అవసరమగు సామాగ్రిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో కల్లూరు పట్టణంలోని పుస్తకాల దుకాణాలు రద్దీగా మారాయి. కల్లూరు మండల పరిధిలోని చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, ముచ్చవరం, పేరువంచ, బత్తులపల్లి తదితర గ్రామాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఒకేసారి పట్టణానికి చేరుకోవడంతో దుకాణాలన్నీ రద్దీగా మారాయి. దీనివలన ఇదే అదునుగా ఒకేసారి అదనపు బాదుడుతో ధరలు పెంచినట్లు తల్లిదండ్రులలో చర్చలు కొనసాగుతున్నవి.

## ఎస్ఐఆర్ నమోదులో నిర్లక్ష్యం వహించరాదు

**-బీఎల్‌వోలు, బీఎల్ఏలు, సర్పంచ్‌లకు అడిషనల్ కలెక్టర్ శ్రీజ సూచన**



**ప్రజాపక్షం/ఏన్కూరు:** సమగ్ర ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని ఖమ్మం అడిషనల్ కలెక్టర్ శ్రీజ అధికారులను హెచ్చరించారు. గురువారం స్థానిక రైతు వేదికలో బీఎల్‌వోలు, బీఎల్ఏలు, సర్పంచ్‌లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల వివరాలను వయస్సు వారీగా విభజించి నమోదు చేయడం ద్వారా పని సులభతరం అవుతుందని తెలిపారు. మ్యాపింగ్, అన్‌మ్యాపింగ్, అనామలీస్ జాబితాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా సిద్ధం చేయాలని ఆదేశించారు. అవసరమైన ధ్రువపత్రాలు లేని వారిని గుర్తించి వాటిని పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఎల్‌వోలు సర్పంచ్‌ల సహకారంతో ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయాలని, నమోదులో జరిగే తప్పులకు సంబంధిత సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం ఆమె కొత్తగా ప్రారంభించనున్న పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌ను పరిశీలించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, తూమాటి శ్రీనివాసరావు, ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## యోగా జీవన విధానంలో అంతర్భాగం కావాలి



**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రతి వ్యక్తి యోగాను తన రోజువారీ జీవన విధానంలో ఒక భాగంగా అలవర్చుకోవాలని ప్రభుత్వ హోమియో వైద్య శాల వైద్యురాలు డాక్టర్ పోరిక జ్యోతి, యోగా శిక్షకురాలు మాధవి సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హోమియో వైద్యశాలలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే సమగ్ర జీవన విధానమని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్ శాఖ రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 13వ తేదీ నుంచి వివిధ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, యోగా ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సిబ్బంది ఐ రామకృష్ణ, వి రాధాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి



**ప్రజాపక్షం/పినపాక:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎన్నికల అధికారులు సూచించారు. పినపాక మండల రైతు వేదికలో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ అనూష, స్పెషల్ ఇన్‌స్పెక్టర్ పరమయ్య పాల్గొని ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులపై సమగ్ర అవగాహన కల్పించారు. ఓటరు జాబితా తయారీలో పాదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బీఎల్‌వోలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పినపాక డిప్యూటీ తహసీల్దార్ రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యాం సుందర్, వివిధ శాఖల అధికారులు, బీఎల్‌వోలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## రాజుపేట పాఠశాలలో ఘనంగా బడి బాట



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల పరిధిలోని రాజుపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం బడి బాట కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతులు, నాణ్యమైన విద్యపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల వయస్సు వచ్చిన చిన్నారులకు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు సాంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసం చేయించి, సాదరంగా పాఠశాలలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరి విద్యను అభ్యసించడం ద్వారా పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ బడుల్లో అందుతున్న నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ భానోత్ మహేష్, ఉప సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు రాజుల రాములు, జానీమియా, దేశిరం, లక్ష్మి , సబు, కలమ్మ, నాయకన్‌గూడెం కాంప్లెక్స్ హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు సాయికుమార్, మాలినీ దేవి, అంగన్‌వాడీ టీచర్ రేణుక, ఏఏపీసీ ఛైర్‌పర్సన్ నాగమణి, గ్రామ పెద్దలు కందాల కమలాకర్‌రెడ్డి, టి శ్రీను, నరసింహాచారి, మేరా సాహెబ్, కోట రాంకీ, హుస్సేన్ పాషా షఫీ, తదితరులు పాల్గొన్నారు.

# రక్త పరీక్షల పేరుతో భారీ దందా..!

**-అర్హత లేకుండానే రక్త పరీక్షలు**
**-చిన్న తప్పుడు రిపోర్ట్‌తో రోగి ప్రాణానికి ప్రమాదం?**
**-రెచ్చిపోతున్న కేంద్రాలు**
**-అధికారులు చర్యలు నామమాత్రమే..**





**ప్రజాపక్షం/వైరా:** ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ఆరోగ్య వ్యవస్థ కళ్ల ముందే అక్రమ డయాగ్నస్టిక్ స్టిక్ ల్యాబ్స్ యధేచ్ఛగా వారి రక్త పరీక్షల దందా సాగిస్తున్నా జిల్లా వైద్యశాఖలో చర్యలు తీసుకునే అధికారులే కనిపించడం లేదు. ఖమ్మం జిల్లాలో ఎలాంటి అనుమతులు, అర్హతలు లేకుండా పెద్ద ఎత్తున రక్త పరీక్ష కేంద్రాలుజ ఏర్పాటు చేసి రక్త పరీక్షలు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు మమ్మల్ని ఎవ్వరూ ఏం చేయలేరు అంటూ సవాల్ విసరుతుండ చూస్తుంటే ప్రజలకు అనుమానాలు కలుగుతున్నాయి. డయాగ్నస్టిక్ సెంటర్‌ల లైసెన్స్‌లు, అర్హత కలిగిన సిబ్బంది, పరీక్షా పరికరాలు, నాణ్యత ప్రమాణాలు, బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న కేంద్రాలపై కఠిన చర్యలు ఉంటాయా లేదా అన్నది అనుమానంగానే ఉన్నాయి. ప్రస్తుతం ప్రతి ఊరిలో పుట్టగొడుగుల రక్త పరీక్ష కేంద్రాలు పుట్టుకొస్తున్నాయి. ఈ రక్త పరీక్ష కేంద్రాల్లో వారు ఇచ్చే రిపోర్ట సక్రమమైన లేదా తప్పిదమా అనేది కూడా ప్రజలను వెంటాడుతున్న సమస్య. ఒక తప్పుడు ల్యాబ్ రిపోర్ట్ రోగిని తప్పు చికిత్స వైపు నడిపించవచ్చు. ఒక నిర్లక్ష్య పరీక్ష రోగి ప్రాణాలకే ముప్పు తెచ్చి పెట్టవచ్చు. అయినప్పటికీ ఖమ్మం జిల్లాలో కొన్ని డయాగ్నస్టిక్ కేంద్రాలు అనుమతులు, అర్హతలు లేకుండానే రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాయనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

### డయాగ్నస్టిక్ సెంటర్‌లలో నిపుణులెక్కడ..?

ఖమ్మం జిల్లాలో అక్రమ డయాగ్నస్టిక్ ల్యాబ్ వ్యవహారం ఆందోళనకు దారితీస్తుంది. ఎలాంటి అనుమతులు, అర్హతలు లేకుండానే కొన్ని ల్యాబ్స్‌లో రక్త నమూనాల సేకరణ, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ఆరోగ్యంతో నేరుగా ముడిపడి ఉన్న ఈ అంశంలో సంబంధిత వాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని ల్యాబ్‌లలో శిక్షణ పొందిన సాంకేతిక సిబ్బంది లేకుండానే రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రయోగశాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రయోగశాల నిర్వహణకు అవసరమైన ప్రమాణాలు నిర్వహణకు అవసరమైన ప్రమాణాలు పాటించకుండానే సేవలు అందిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వైద్య రంగంలో చిన్న పొరపాటు కూడా రోగి ప్రాణాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇటువంటి కేంద్రాల కార్యకలాపాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. అక్రమంగా కార్యలాకాపాలు నిర్వహిస్తున్న కొందరు ల్యాబ్ నిర్వాహకులు బహిరంగంగానే మమ్మల్ని ఎవ్వరూ ఏం చేయలేరు. ఏం చేస్తారో చేసుకోండి అంటూ వ్యాఖ్యానిస్తున్నారని పలు మండలాల్లో పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ధీమా వెనుక అధికారులు అండదండలు ఉన్నాయా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో ఇలాంటి నిర్లక్ష్య ధోరణి ప్రమాదకరమని వారు అంటున్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఈ వ్యవహారంలో అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ ల్యాబ్లపై ఉక్కుపాదం మోపుతారా? లేక ఫిర్యాదులు, ఆరోపణలకే పరిమితమవుతారా? అన్నది వేచిచూడాల్సి ఉంది.

# పాలేరు రాజకీయాల్లో వేడి పెంచిన కెటిఆర్ సభ..!

**- మంత్రి పొంగులేటిపైనే ఫోకస్**
**- విమర్శలపై పొంగులేటి సైతం సవాల్**
**- బీఆర్ఎస్ శ్రేణుల్లో పెరిగిన ఉత్సాహం**
**- వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్**
**- ట్రోలింగ్స్‌తో వేడెక్కుతున్న వాట్సప్ గ్రూపులు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి తెలంగాణ రాష్ట్రం వరకు పాలేరు నియోజకవర్గానికి రాజకీయంగా ప్రత్యే క ప్రాధాన్య ఉంది. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన నాయకులు ప్రభుత్వలలో మంత్రులుగా రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన సందర్భాలు ఉండటంతో పాలేరురాజకీయం చర్చల్లో తరచుగా కేంద్ర బిందువుగా నిలుస్తూ వచ్చింది. అలాంటి ప్రాంతంలో తాజాగా నిర్వహించిన బీఆర్ఎస్ కార్యక్రమం కేవలం పార్టీ సమావేశంగా ముగియకుండా రాజకీయ వివాదానికి దారితీసింది. సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం, ముగ్గురు మంత్రు లు అందులోనూ ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై చేసిన విమర్శలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. అయితే ఈ విమర్శల్లో ప్రధాన దృష్టి మంత్రి పొంగులేటిపై నిలవడం స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. సాధారణ విమర్శలకు మించి సవాళ్లు, వ్యక్తిగత టార్గెట్ కోణంలో ప్రస్తావించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందా? అనే చర్చ మొదలైంది. రాజకీయంగా ప్రత్యర్థి బలమైన ప్రాం తంలోనే నేరుగా ప్రశ్నలు, విమర్శలు లేవనెత్తడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని ఆలోచన ఉందా? అనేది కూడా ప్రధానాంశంగా నిలిచింది. మరోవైపు ఇది పాలేరులో అధికార నాయకత్వ ప్రభావాన్ని సవాలు చేసే ప్రయత్నమా? అన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో ఈ విమర్శలు తక్షణ రాజకీయ ప్రతిస్పందన కోసమా? లేక భవిష్యత్ రాజకీయ స్థలాన్ని తిరిగి నిర్మించుకునే ప్రయత్నమా? అనే ప్రశ్నలు కూడా రాజకీయవర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రతిస్పందించడం, సవాల్ విసరడం రాజకీయ వేడిని మరింత పెంచింది. సాధారణ ఖండన స్థాయిని దాటి నేరుగా రాజకీయ ప్రతిస్పందన రావడం వల్ల సభ ప్రభావం అక్కడితో ఆగకుండా చర్చ మరింత విస్తరించింది. ఇక ఈ మొత్తం పరిణామంలో గమనించదగిన అంశం బీఆర్ఎస్ శ్రేణుల్లో కనిపించిన చలనం ఇంత కాలం నిశ్శబ్దంగా ఉన్న పార్టీ కేడర్ సామాజిక మాధ్యమాలు, స్థానిక స్థాయి స్పందనల ద్వారా మళ్లీ చురుకుదనం ప్రదర్శించడం రాజకీయంగా పరిశీలనీయ అంశంగా మారింది. దీన్ని కేవలం సభ ప్రభావంగా చూడాలా? లేక సంస్థాగత పునరుద్దరణకు సంకేతంగా భావించాల? అనే చర్చ కూడా మొదలైంది. అదే సమయంలో కాంగ్రెస్ నాయకత్వం వెంటనే కౌంటర్ ఇవ్వడం వల్ల రాజకీయ కథనం ఒక్కవైపుకి వెళ్లకుండా నిలిచింది. అయితే రాజకీయాల్లో సభల ప్రభావం వేదికపైనే ముగియదు. ఆ సభ తర్వాత ఏర్పడే చర్చ, ప్రత్యర్థుల ప్రతి స్పందన, కేడర్ చలనం, ప్రజల దృష్టి ఏ అంశంపై నిలుస్తుందన్నదే అసలు రాజకీయ ఫలితాన్ని నిర్ణయిస్తుంది. అయితే రాజకీయ సభల విజయాన్ని జనసమీకరణతో మాత్రమే కొలవడం కష్టం. ఆ సభలో వచ్చిన సందేశం ప్రజా చర్చగా మారుతుందా? విమర్శలు రాజకీయ ప్రభావంగా మారుతాయా? లేక ప్రతి స్పందనలతో అక్కడికక్కడే చల్లారిపోతాయా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పాలేరు రాజకీయాల్లో ఈ సభ తాత్కాలిక రాజకీయ వేడిని మాత్రమే పెంచిందా? లేక రాబోయే రోజుల్లో స్థానిక రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే రాజకీయ ప్రారంభ సంకేతంగా నిలుస్తుందా? విమర్శలు కార్యాచరణగా మారుతాయా? వేచి చూడాల్సిందే.

### వేడెక్కిన వాట్సప్ గ్రూపులు...

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన ఆరోపణలతో పాలేరులో రాజుకున్న రాజకీయ వేడి వాట్సప్, సామాజిక మాధ్యమాల్లో మరింత వేడెక్కించింది. కాంగ్రెస్ శ్రేణులు మంత్రి పొంగులేటిపై వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రకటనలు విడుదల చేస్తుండగా కాంగ్రెస్ శ్రేణులు గతంలో ప్రభుత్వంలో ఉన్న సమయంలో కేటీఆర్ వ్యవహరించిన తీరును వీడియోల రూపంలో ట్రోల్ చేస్తున్నారు. అలాగే సభలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను జోడించి ట్రోల్ చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కాంగ్రెస్ ముందు వరుసలో ఉండగా బీఆర్ఎస్ కొంత వెనుక పడినట్లుగా కనిపించింది. అయితే కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు ఎవరి స్థాయిలో వారు ప్రకటనలతో ఖండిస్తున్నప్పటికీ కేటీఆర్‌పై జరుగుతున్న ఖండనలు, ట్రోలింగ్‌పై బీఆర్ఎస్ నుంచి ఎటువంటి కదలికలు రాకపోవడం గమనర్హం.

# కనిపెట్టకుండా కనికట్టు..!

**- ట్రాఫిక్ చెలానాలు తప్పించుకునే ఎత్తుగడ**
**- నెంబర్ ప్లేట్లకు ముసుగులు, మెలితిప్పుడు**
**- ముందో నెంబర్ వెనుకో నెంబర్**
**- జిల్లాలో వందల సంఖ్యలో వాహనాలు**
**- తప్పుడు మార్గంలో పలు సిక్కర్లతో వాహనాలు**
**- ట్రాఫిక్ పోలీసులకు సవాల్‌గా మారుతున్న సమస్య**
**- మోసాలకు పాల్పడితే దోషులే : ఎంవిఐ**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో ఆకతాయిల ఆగడాలు రోజురోజుకీ మితిమీరి పోతున్నాయి. ట్రాఫిక్ చలానాల నుండి తప్పించుకునేందుకు పలు రకాల ఎత్తుగడలు వేస్తున్నారు. వాహనాల నెంబర్లను కనిపెట్టకుండా మాస్కులు వేయడం, నెంబర్ ప్లేట్లను మెలితిప్పడం, నెంబర్ ప్లేట్లో 3 అనే అంకె ఉంటే దానిని 8గా మార్చడం, 2 అంకె ఉంటే దానిని 5గా మార్చడం, 1వ అంకె ఉంటే దానిని 7లా మార్చడం వంటి రకారకాల ఎత్తుడగలకు పాల్పడుతున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయి. ఫేక్ నెంబర్లకు చెక్ పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఆకతాయిల ఆటలు ఆగడం లేదు. మరో ప్రక్క ముందు ఒక నెంబర్ పెట్టుకుని తిరుగుతూ వెనుక వైపు వేరే నెంబర్ తగిలిస్తున్నారు.

**ఒక్కొక్కరికి ఒక్కో సమస్య :** వాహన దారులు వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారు. ఇందులో ఒక్కొక్కరికి ఒక్కో సమస్య. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అడ్డదిట్టంగా తిరిగే వాళ్లు, రాంగ్ రూట్‌లో వెళ్ళే వాళ్లు, ట్రిపుల్ రైడింగ్ చేసే వాళ్లు, హెల్మెట్ లేకుండా నడిపే వాళ్లు, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వాళ్లు, ర్యాష్ డ్రైవింగ్ చేసే వాళ్లు, బండ్లతో విన్యాసాలు చేసే వారు పోలీసు భారి నుండి తప్పించుకునేందుకు అనేక ఎత్తుగడలు వేస్తుండగా, మరి కొందరు ఇఎంఐలు చెల్లించ లేక ఫైనాన్సర్లు ఎక్కడ వాహనాలు లాక్కెళ్లి పోతారో అనే భయంతో చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు.

**సాంకేతిక కన్ను కప్పి :** పోలీసులు తాజాగా ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానపు కన్నును కప్పేస్తున్న వారు కూడా లేకపోలేదు. రావాణాశాఖ జారీ చేసిన నెంబర్ ప్లేట్ల నెంబర్‌లు ట్రాఫిక్ పోలీసులు వద్ద ఉంటే దొంగలను పట్టుకోవడం సులువైన పనే. చాసిస్ నెంబర్. ఇంజన్ నెంబర్ ఆధారంగా మోసగాళ్లను ఇట్టే కనిపెట్టవచ్చు. ట్రాఫిక్ వారి వద్ద పాత నెంబర్లు లేకపోవడంతో అసలు, నఖిలీ గుర్తింపు కష్టంగా మారింది.

**చలానాల సమాచారం మరొకరికి :** ఆకతాయిలు పలు కారణాలతో నెంబర్ ప్లేట్లపై నెంబర్లును అటుఇటు మార్చడం వల్ల ఆ నెంబర్ వేరే వాళ్లకు ఉంటే ట్రాఫిక్ పోలీసులు ఫొటో కొట్టిన వెంటనే ఆ సమాచారం కనిపెంచే నెంబర్ గల వాహన దారునికి వెళుతోంది. దీంతో వారు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. సమయం లేని వారు సర్దుకు పోయి చెల్లింపులు చేస్తున్నారు. ఈ సమస్య ద్విచక్ర వాహనాలకే కాకుండా ఆటోలు, కార్లకు కూడా ఉంది.

**పలు స్టిక్కర్లు :** అనర్హులు కూడా చాలా మంది వారి వాహనాలకు పలు రకాల స్టిక్కర్లు వేసుకుని తిరిగేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అసలైన వారికి ఇబ్బంది తప్పట్లేదు. సమాజంలో ఎంఎల్ఏలు,ఎంపిలు, చైర్మన్లు విలేకరులు, ఇతరత్రా ప్రముఖులపై ఉండే గౌరవంతో పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుంటారు. దీనిని అదునుగా చేసుకుని చాలా మంది అడ్డదారిలో వారి వాహనాలకు ప్రెస్ స్టిక్కర్లు వేసుకుని తిరిగేస్తున్నారు. అంతే కాకుండా పలానా వారి తాలూకా, వివిధ రకాల సంఘాల పేర్లు, కులాల పేర్లు వేసుకోవడం కూడా సరైన పద్దతి కాదు. దీనిపై పోలీసులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

### తప్పుడు నెంబర్ ప్లేట్లు వేయడం నేరం : ఎంవిఐ సంగం వెంకట పుల్లయ్య

వాహనాలపై రకరకాల కారణాలతో తప్పుడు ప్లేట్లు వేసుకుని తిరగడం, నెంబర్లు కనిపించకుండా చేయడం, అసలు నెంబర్ల స్థానంలో నిఖిలీ నెంబర్లు జత చేయడం చట్ట రిత్యా నేరం. 1988 మోటారు వాహనాల చట్ట ప్రకారం శిక్షార్హులు. ఇది తీవ్రమైన సందర్భాల్లో బిఎన్ఎస్ చట్ట పరిధిలో దోషులుగా తేలుతారు. నెంబర్ పేట్లు కాకుండా వివిధ రకాల స్టిక్కర్లు వేయడం కూడా నేరమే.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**-అధికారిక ఇసుక ర్యాంపుల నుంచే సరఫరా జరగాలి**
**-భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సొసైటీ సభ్యులు అధికారికంగా నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపుల నుంచే ఇసుక సరఫరా జరగాలని, మైనింగ్ అధికారులు, సొసైటీ సభ్యుల అనుమతి లేకుండా గోదావరి ఇసుకను తరలించడం గానీ, ఇష్టానుసారంగా ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేసి నిల్వలు చేయడం గానీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ హెచ్చరించారు. గురువారం తెల్లవారుజామున సారపాక పరిధిలోని తాళ్లగొమ్మూరు గోదావరి పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇసుక నిల్వలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రెవెన్యూ అధికారులతో మాట్లాడిన ఆయన, సోంపల్లి అధికారిక ఇసుక ర్యాంపుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు, అలాగే అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ చేస్తున్నట్లు తమ దృష్టికి రావడంతోనే ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అధికారికంగా సొసైటీ నిర్వహించే ఇసుక ర్యాంపుల నుంచే ఇసుక సరఫరా జరగాలని, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు గోదావరి ఇసుక నిల్వలు ఉన్న ప్రాంతాల్లో కంచెలు లేదా కందకాలు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే గోదావరి కరకట్ట ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది 24గంటల పాటు నిఘా ఏర్పాటు చేసి అక్రమ ఇసుక రవాణాను నిరోధించాలని సూచించారు. సొసైటీ సభ్యుల అనుమతి లేకుండా అనధికారికంగా ఇసుక తరలించే వాహనాలను వెంటనే సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. భవిష్యత్తులో కూడా ఎప్పటికప్పుడు ఇసుక ర్యాంపులను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని పేర్కొన్న ఆయన, అధికారిక ర్యాంపులు నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు నిబంధనలకు లోబడి పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ తనిఖీల్లో డీటీ సమ్మయ్య, అదనపు ఎస్ఐ రామ్మూర్తి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పొంగులేటిని విమర్శించే అర్హత కెటిఆర్‌కు లేదు..



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని, ఆయనను విమర్శించే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదని అన్నపురెడ్డిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరసా వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఖమ్మం ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తోందని, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మరకాల లక్ష్మారెడ్డి, దుబ్బాకుల రాము, రామ్‌రెడ్డి, వెంకటరెడ్డి, నాగేశ్వరరావు, మాయర కృష్ణ, జమలయ్య, లక్ష్మణరావు, మాందాస్, ఎల్లయ్య, ముస్లిం మైనారిటీ సెల్ నాయకులు గఫర్, రంగా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని ములసలిమడుగు గ్రామ పంచాయితీ సర్పంచ్ పీ సురేందర్ పిలుపునిచ్చారు. గురువారం సందేళ్ళ రామాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం వంటి అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి మాన్‌సింగ్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడం వల్ల బోధన, అభ్యాస ప్రక్రియ సక్రమంగా కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలను సమర్థవంతంగా వినియోగించుకొని మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శిరీషా బాయి, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండలంలోని ఇరవెండి గ్రామ పంచాయితీ పరిధిలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గుండి బాబురావు, ఉప సర్పంచ్ మహంకాళి రామారావు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి విద్యాభ్యాసంలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు గ్రామ పంచాయితీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యురాలు గుగులోతు దుర్గ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 10వేల వేతనం అమలు చేయాలి




**ప్రజాపక్షం/దమ్మపేట:** మధ్యాహ్న భోజన కార్మికులకు ఎన్నికల హామీ మేరకు రూ 10వేల వేతనాన్ని అమలు చేయాలని, విద్యార్థులు మెనూ ఛార్జీలను రూ 25కు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికుల సమ స్యల పరిష్కారం కోరుతూ మండల విద్యా శాఖ అధికారి జగపతికి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 ఏళ్లుగా సేవలందిస్తున్న వంట కార్మికులకు కనీస వేతనాలు కూడా అందడం లేదన్నారు. పెరిగిన ధరల నేపథ్యంలో ప్రస్తుత మెనూ అమలు కష్టంగా మారిందని, వంట గ్యాస్, కోడిగుడ్లను ప్రభుత్వం నేరుగా సరఫరా చేయాలని కోరారు. రాజకీయ కారణాలతో పాత కార్మికులను తొలగించవద్దని, గుర్తింపు కార్డులు, రెండు జతల యూనిఫాంలు అందించా లని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహర రఘు, మధ్యాహ్న భోజన వర్కర్ల సీనియర్ మండల అధ్యక్షురాలు సత్యవతి, మండల కార్యదర్శి శ్రీదేవి, నాయకులు రోజా, జయలక్ష్మి , సుగుణ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

## సమ్మె నోటీసుతో దిగివచ్చిన యాజమాన్యం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంపై గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు ప్రభావంతో యాజమాన్యం దిగివచ్చింది. కార్మికుల పెండింగ్ సమస్యలు, ఆందోళనలపై చర్చించేందుకు ఈ నెల 25న హైదరాబాద్‌లో రీజినల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో జరిగే చర్చలకు హాజరుకావాలని ఏఐటీయూసీని యాజమాన్యం ఆహ్వానించింది. అయితే చర్చల పేరుతో కాలయాపన చేస్తే సహించేది లేదని, కార్మికుల సమస్యలకు స్పష్టమైన పరిష్కారం చూపకపోతే సమ్మె తప్పదని ఏఐటీయూసీ హెచ్చరించింది. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా యాజమాన్యం మొండివైఖరి కొనసాగిస్తే సింగరేణి వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేసింది. గురువారం ఉదయం సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య మాట్లాడుతూ సమ్మె హెచ్చరిక ఫలితంగానే యాజమాన్యం చర్చలకు రావాల్సి వచ్చిందన్నారు. చర్చలు ఫలప్రదంగా లేకపోతే ఎప్పుడైనా సమ్మెకు వెళ్లేందుకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం సత్తుపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ్మె నోటీసు ఇచ్చిన వెంటనే యాజమాన్యం చర్చలకు ముందుకు రావడం ఏఐటీయూసీ పోరాట పటిమకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, సత్తుపల్లి కార్యదర్శి సముద్రాల సుధాకర్, సూర్యప్రకాష్, భీమయ్య , నర్సింహారావు, ఉపేంద్రచారి, బాలసుబ్రమణ్యం, సుధాకర్, భరణి, కిషోర్, మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బకాయిలను సత్వరమే చెల్లించాలి



**-ఈహెచ్ఎస్‌కు విధి విధానాలు ఎప్పుడు**
**-ఎస్‌జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆర్థిక సమస్యలతో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సతమతమవుతున్నారని సత్వరమే ఉద్యోగ విరమణ బకాయిలను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఏటి) జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగదు రహిత వైద్య సేవలకు సంబంధించి ఈహెచ్ఎస్ విధి విధానాలను సత్వరమే ప్రకటించి అమలు చేయాలని కోరారు. గురువారం కృషి భవన్‌లో ఎస్‌జిపిఏటి ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరచూ మారుతున్న రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా పెన్షనర్లు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఉద్యోగ విరమణ బకాయిలు రాకుండానే పలువురు పెన్షనర్లు తనువు చాలించారని, బకాయిల నిమిత్తం కోట్లాది రూపాయల విడుదల చేస్తున్నామని ప్రచారం కాకుండా నిధులు విడుదల చేయాలని కోరారు. వందలాది మంది పెన్షనర్లకు జిపిఎఫ్‌లోనే కోట్లాది రూపాయల బకాయిలు ఉండగానే జిపిఎఫ్ చెల్లింపులు పూర్తయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం శోచనీయమన్నారు. విధి విధానాలు లేకుండా, ట్రస్టు కమిటీ ఏర్పాటు కాకుండానే ఉద్యోగులు, పెన్షనర్ల నుండి ప్రీమియం మినహాయించిన ప్రభుత్వం తక్షణమే విధి విధానాలు ప్రకటించాలన్నారు. ఏఏ వైద్యశాలల్లో వైద్య చికిత్స ఉందో తెలపాలని, ట్రస్టు బోర్డులో పెన్షనర్లు ప్రతినిధులుగా ఎస్‌జిపిఏటితో పాటు సిపిఎస్ ఉద్యోగ సంఘం ప్రతినిధికి ప్రాతినిథ్యం కల్పించాలని పరిశ పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఉపాధ్యక్షులు పెదమాళ్ల సత్యనారాయణ, ఊడుగు వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, హుస్సేన్, నాగప్రసాద్, ఉషారాణి, చీదిరాల వెంకటేశ్వర్లు, భాస్కర్ రావు, ఆదినారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు





**ప్రజాపక్షం/వైరా:** వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో నకిలీ విత్తనాలు విక్రయాలను అరికట్టడానికి వ్యవసాయ, పోలీస్ శాఖలు సంయుక్తంగా వైరాలోని తాటిపూడిలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. విత్తన దుకాణాలు, గోదాములు, రవాణా కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపులను సందర్శించి, విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులు క్షుణ్ణంగా పరిశీఇంచారు. రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. అలాగే ప్యాకెట్లపై ఉన్న వివరాలు, తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని, రైతుల కష్టార్జిత సంపాదను దోచుకునే నకిఈ వ్యాపారులపై పోలీస్, వ్యవసాయశాఖ ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. వైరా పరిసర ప్రాంతాల రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ కరుణశ్రీ, మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్, వైరా ఎస్సై పుప్పాల రామారావు, పలువురు పోలీసులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం



**పాల్గొన్న పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కాపా చంద్రకళ**

**ప్రజాపక్షం/వైరా:** శాంతినగర్ 20వ వార్డులోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయం వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఖమ్మం జిల్లా స్తంభాద్రి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(సుడా) చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, 20వ వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు వారు పొందారు. ఈ సందర్భంగా పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దేవాలయాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడానికి ఇటువంటి వార్షికోత్సవాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో, సుఖసంతోషాలతో జీవించాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వుంద్రు శ్యామ్‌బాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శీలం చంద్రశేఖర్, వీరంశెట్టి సీతారాములు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, తేళ్లూరి వీరయ్య, బాలాజి, పండు, వాంకుడోతు భీక్యా, దుర్గ, నాగేశ్వరరావు, బాలమ్మ, లక్ష్మీ బాయి, రాము, గుడిపూడి సురేష్, కంభంపాటి సత్యనారాయణ, బత్తుల కొండలు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు తదితర నాయకులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు, కౌలు రైతులకు యూరియా పంపిణీ చేయాలి

**ప్రజాపక్షం/పెనుబల్లి:** పట్టాదారు పాస్ పుస్తకాల తో సంబంధం లేకుండా రైతులకు, కౌలు రైతులకు యూరియా పంపిణీ చేయాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పెనుబల్లి మండలంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండిస్తున్న వరి ధాన్యం ప్రతి రకం వడ్లకి 500 రూపాయలు బోనస్ ఇవ్వాలని, కేవలం సన్న రకాల ధాన్యానికి బోనస్ ఇస్తాం అనడం సరికాదన్నారు. నకిలీ ఎరువులు నకిలీ విత్తనాలను గుర్తించి సంబంధిత విక్రయిదారులపై చర్యలు తీసుకోవాలని రైతులందరికీ నాణ్యమైన ఎరువులు విత్తనాలు అందేలా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. యూరియా యాప్ సంబంధం లేకుండా రైతుల పంట పొలాలకు సరిపడా ముందస్తుగా స్టాక్ ను నిలువ చేసుకోవాలన్నారు. గత ఖరీఫ్ సీజన్లో రైతులు 32 వేల టన్నుల యూరియాను వినియోగించారని, యూరియా కోసం నానా ఇబ్బందులు పడ్డారన్నారు. అటువంటి పరిస్థితులు లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.




మొక్కజొన్న పండించిన రైతులకు నేటికీ వారి ఖాతాల్లో డబ్బులు సమకాలేదని వెంటనే జమ చేయాలన్నారు. రైతుబంధు విడతలతో సంబంధం లేకుండా ఏకకాలం గా రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ రైతు సంఘం కార్యదర్శి రావుల రాజబాబు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చిట్టిమోదుల కృష్ణయ్య, రైతు సంఘం నాయకులు చిలుకూరు వెంకటేశ్వరరావు, కర్రీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న మాజీ మంత్రి పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కుటుం బ సమేతంగా దర్శించుకున్నారు. గురువారం ఉదయం విఐపి ప్రారంభ విరామ దర్శన సమయంలో పువ్వాడ అజయ్ కుమార్ కుటుంబ సమేతంగా స్వామి వారి సేవలో పాల్గొన్నా రు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారినివేడుకున్నట్లుఅజయ్‌కుమార్ తెలిపారు.

# రూ.750కోట్లతో గోడౌన్ నిర్మాణాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రాష్ట్రంలో రూ.750 కోట్లతో నూతనంగా గోడౌన్ నిర్మాణాలు చేపడుతున్నట్లు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో గోడౌన్‌లను గురువారం సందర్శించి మాట్లాడారు. గోడౌన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేసి, స్టాక్ రికార్డుల ప్రకారం ఉందా..లేదా అని స్వయంగా పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా 50కేంద్రాలలో 7.50లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్‌ల నిర్మాణాలు, మరో 25 కేంద్రాలలో 2.50లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గలగోడౌన్‌లను తొందరలోనే చేపడతామని తెలిపారు. ఏడాది లోపు 10లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్‌లను నిర్మించి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. రాష్ట్ర రాజధానిలో ప్రముఖ కంపెనీలకు ఈకామర్స్ గోడౌన్‌లకు రూ.70కోట్లతో 23ఎకరాలలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. జిల్లా లోని వెంకటాయపాలెంలో మిర్చి కోల్డ్ స్టోరేజీ నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేయనున్నట్లు తెలిపారు. 5లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 15లక్షల టన్నుల వరకు సంస్థ నిర్మాణాలు చేపట్టేందుకు కార్యచరణ చేసినట్లు తెలిపారు. పండించిన వ్యవసాయ ఉత్పత్తుల నిల్వలకు గోడౌన్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# మంత్రి పొంగులేటిపై కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు

**- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఖమ్మంరూరల్ మండల కమిటీ**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన ఆరోపణలు సరికాదని కాంగ్రెస్ ఖమ్మంరూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం అన్నారు. గురువారం ఖమ్మంరూరల్ మండలంలోని గోళ్లపాడులో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పది సంవత్సరాల పాలనలో కేటీఆర్ చేసిన అవినీతి, అహంకార తీరు ప్రజలందరికి తెలుసునన్నారు. అందుకనే కర్రు కాల్చి వాత పెట్టడంతో అధికారం పోయి పిచ్చి పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారన్నారు. మరో మారు మంత్రి పొంగులేటిపై ఇష్టానుసారంగా మాట్లాడితే తప్పకుండా ఆయన అభిమానులు, పాలేరు కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు మద్ది మల్లారెడ్డి, మండల నాయకులు వీరారెడ్డి, శ్రీనివాసరావు, ముత్యం చిన్న కృష్ణారావు, రుద్ర ఉపేందర్, శ్యామల రాంరెడ్డి, మద్ది గంగిరెడ్డి, నారాయణ, గునిగంటి సురేష్, రాజేష్, పిఎస్ఆర్ సోషల్‌మీడియా ఇంచార్జ్ బద్రి సాయి పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు




**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మధిర రూరల్ ఎస్సై అమర్లపూడి విశ్వతేజ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఫ్రెండ్లీ నేరస్తులకు పోలీసింగ్ ఉండదని పౌరులకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్ అని, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా..కోడి పందాలు, జూదం నిర్వహించిన తమకు సమాచారం అందిస్తే నిందితుపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

# బోధకులు సహాయకుల పోస్టులకు ఇంటర్వ్యూలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని ఫ్రీ ప్రైమరీ పాఠశాలల్లో విద్యా బోధన గాను బుధవారం కల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మర్లపాడు, కొత్త బోడిమల్లే, అంబేద్కర్ నగర్, నారాయణపురం, చిన్న కోరుకొండి, కల్లూరు లలో పోస్టులు ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంఈఓ నివేదిత తెలిపారు. మండల కమిటీ తహశీల్దార్, ఎంపీడీవో చంద్రశేఖర్ ల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో సాయంత్రం వరకు కొనసాగుతూనే ఉన్నవి. ఈ కార్యక్రమంలో ఉదయం తొమ్మిది గంటల నుండి ఇంటర్వ్యూ గదుల వద్ద వేచి చూసిన వారు తీవ్ర ఇబ్బందులు పడినట్లు అభ్యర్థులు తెలిపారు. గదులలో ఉక్క పోత ఫ్యాన్లు లేకపోవడం చాలీచాలని మంచినీటి సౌకర్యం లేనందున గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూడాల్సి వచ్చింది. పిల్లలు తల్లులతో వచ్చిన వారు ఇంకా ఇబ్బందులు పడ్డారు. 12 పోస్టులకు గాను 242 మంది హాజరైనట్లు సమాచారం.

# నిర్ణీత గడువులోగా సర్వే, నమోదు ప్రక్రియలు పూర్తి చేయాలి



## నక్ష సర్వేను పరిశీలించిన కలెక్టర్ అంకిత్

ప్రజాపక్షం/మణుగూరు: భూముల రీసర్వే, పట్టణ భూముల హద్దుల గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నక్ష కార్యక్రమంలో భాగంగా మణుగూరు మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఆర్.ఓ.ఆర్. (రికార్డ్ ఆఫ్ రైట్స్) నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వర్షాకాల సన్నద్ధతలో భాగంగా గోదావరి వరదల ప్రభావానికి గురయ్యే ప్రాంతాలు, ముంపు ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. మణుగూరు మండలం కొమ్ముగూడెం గ్రామంలో మున్సిపల్ సిబ్బంది నిర్వహిస్తున్న ఆర్.ఓ.ఆర్. నమోదు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ప్రతి ఎంట్రీ నమోదు చేయడానికి పడుతున్న సమయం, నమోదు చేస్తున్న వివరాల స్వరూపం, ప్రజల నుంచి సేకరిస్తున్న సమాచారంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూములకు సంబంధించిన వివరాలను అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నక్ష పైలట్ ప్రాజెక్టు ద్వారా భూ రికార్డుల సమగ్రత, పారదర్శకత పెరగడంతో పాటు ప్రజలకు భూములకు సంబంధించిన సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సర్వే, నమోదు ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటన లో కలెక్టర్ వెంట మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ శాఖ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పలు చోట్ల తెగిపడిన విద్యుత్ వైర్లు





ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం జిల్లాలో బుధవారం ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గాలికి చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఖమ్మంలోని అల్లిపురం రోడ్డులోనూ ఇదే పరిస్థితి. బోనకల్ మండలంలో రాపల్లి, చిన్నబీరవల్లి, పెద్ద బీరవల్లి, నారాయణపురం గ్రామాల్లో 24 గంటలుగా విద్యుత్ సరఫరా లేదని ప్రజలు కనీస తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతు జరిగినా విద్యుత్‌ను పునరుద్ధరించలేదు. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

# గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం



## -88.590కిలోల గంజాయి స్వాధీనం
## -రూ 44లక్షల విలువైన మాదకద్రవ్యాలు పట్టివేత
## -టాస్క్‌ఫోర్స్, పోలీసుల సంయుక్త తనిఖీల్లో కీలక విజయం

ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండలంలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతూ మరో కీలక విజయాన్ని సాధించారు. ఈ విషయంపై అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో డిఎస్‌పి ఆదినారాయణ ప్రెస్ మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం క్రాస్ రోడ్ వద్ద గురువారం ఉదయం పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఇన్నోవా కారును ఆపి తనిఖీ చేయగా, అందులో భారీ మొత్తంలో నిషేధిత గంజాయి ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేయగా మొత్తం 88.590 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ 44లక్షలుగా ఉంటుందని తెలిపారు. ఈ నిషేధిత గంజాయి రవాణాలో ఐదుగురు వ్యక్తుల హస్తం ఉన్నట్లుగా గుర్తించామని, వీరు కేరళ, బెంగళూరు నుంచి రాజమండ్రి మీదుగా తెలంగాణ ఛత్తీస్‌ఘడ్ సరిహద్దు అయినటువంటి చింతూరు వద్ద గంజాయిని తీసుకొని అక్కడ నుంచి విజయవాడకు వెళ్లే క్రమంలో అన్నపురెడ్డిపల్లి సమీపంలో పోలీసులకు పట్టు పడ్డారని, వారిలో డ్రైవర్ శ్రీరాజ్ కుంజా విటల్ బెంగళూరు నుంచి ఉబర్ ద్వారా ఇన్నోవా వాహనాన్ని 50వేల రూపాయలకు మాట్లాడుకుని ఈ డీల్‌ని ఒప్పుకుంటాడు. ఇతనితో పాటు కేరళకు చెందిన మహమ్మద్ రిషాద్ చేరి ఎండి అనే వ్యక్తి వాహనంలో ఉన్నారు. వీరిద్దరిని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా ఈ రవాణాకు ఫైనాన్షియర్‌గా హర్షద్, సెల్లర్‌గా కిషోర్, రిసీవర్‌గా సజ్జత్‌లు ఉన్నారని వారి వివరాలను తెలియపరిచారు. వీరిపై కేసు నమోదు చేసి దొరికిన వీరిద్దరిని కోర్టుకు హాజరు పరుస్తూ దర్యాప్తు చేపడుతున్నారని తెలియపరిచారు. అదే విధంగా జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, నిల్వలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. నిషేధిత మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడే వారిపై చట్టపరంగాగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మి, అన్నపురెడ్డిపల్లి ఎస్‌హెచ్‌ఓ విజయ సింహారెడ్డి, ఎస్ఐ ప్రసాద్, కానిస్టేబుల్స్ షేక్ పాషా, నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భూముల వేలం నిలిపివేయండి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం అర్బన్ మండలంలోని మల్లెమడుగు రెవెన్యూ పరిధిలోని కైకొండాయిగూడెం ప్రాంతానికి చెందిన ప్రైవేటు భూముల బహిరంగ వేలాన్ని నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌కు విజ్ఞప్తి చేశారు. కైకొండాయి గూడెం గ్రామానికి చెందిన పిడుగు మేఘశ్యామల గురువారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అడుసుమల్లి మల్లికార్జున శర్మ, శంకరమ్మల వారసురాలినని వారు దివంగతులయ్యారని వారి వారసురాలిగా తనకు రావాల్సిన భూమిని చట్టబద్ధత లేకుండా లీజు హక్కుల వేలాన్ని నిర్వహించడం సరికాదని ఆమె వినతి పత్రం పేర్కొన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారులు సర్వే నెం. 302/ఎ, 326/ఎ, 336/ఎ, 325/ఎ, 327/ఎ, 337/ఎలో ఉన్న భూమి పై తమకు హక్కులు ఉన్నాయని దీనిని వేలం నిర్వహించడం సరికాదన్నారు. తక్షణం వేలాన్ని నిలిపి వేయాలని ఆమె వినతి పత్రంలో కోరారు.

# ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

ప్రజాపక్షం/మణుగూరు: భద్రాచలం నుండి ఒరిస్సాకు స్కార్పియో వాహనంలో 80 కేజీల గంజాయిని తరలిస్తున్న క్రమంలో ఇద్దరిని పట్టుకొని అరెస్ట్ చేశారు. 80 కేజీల గంజాయితో పాటు స్కార్పియో ను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురు రాజస్థాన్ కు చెందిన సురేంద్ర సింగ్, ధర్మేంద్ర కుమార్ గా గుర్తించి, కేసు నమోదు చేసి రిమాండ్కు తరలిస్తున్నట్లు డిఎస్పి రవీందర్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రెస్ మీట్ లో సిఐ నాగబాబు, ఎస్సై నగేష్ కుమార్, ఎస్సై రవుఫ్ లు, హెడ్ కానిస్టేబుల్ దామోదర్, కానిస్టేబుల్ మురారి లు పాల్గొన్నారు.

# జూన్ 22లోపు లైవ్ అథెంటికేషన్ తప్పనిసరి



ప్రజాపక్షం/పినపాక: పినపాక మండలంలో చేయూత పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులు ఈనెల 22వ తేదీలోపు తప్పని సరిగా లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఎంపీడీవో సంకీర్త్ సూచించారు. గడువులోపు లైవ్ అథెంటికేషన్ పూర్తి చేయని లబ్ధిదారుల పెన్షన్ నిలిచిపోయే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. పెన్షన్ సకాలంలో అందుకోవాలంటే లబ్ధిదారులు వెంటనే తమ గ్రామ పంచాయితీ కార్యదర్శిని సంప్రదించి అథెంటికేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు. అందువల్ల అర్హులైన ప్రతి లబ్ధిదారుడు నిర్దేశిత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకుని ఇబ్బందులు ఎదుర్కోకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

# నాసిరకం నిర్మాణంతో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

## -అల్లిపురం రోడ్డులో ప్రమాదకర పరిస్థితులు



ప్రజాపక్షం/ ఖమ్మం: అధికారుల నిర్లక్ష్యం, గుత్తేదారు ఇష్టానుసార వైఖరి వెరసి ప్రమాదాలకు కారణమైంది. విద్యుత్ లైన్ల నిర్మాణం నాసిరకంగా జరగడంతో గాలివానకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బుధవారం రాత్రి ఖమ్మంలో కురిసిన వర్షానికి ఖమ్మం, అల్లిపురం రోడ్డులో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఖమ్మం ముస్తఫానగర్ మమత రోడ్డు నుంచి అల్లిపురం వరకు రూ. 25 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా గతంలో ఉన్న విద్యుత్ లైన్లను తొలగించి కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. కానీ విద్యుత్ స్తంభాలు నిలబెట్టే విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఒక గాలి వానాకే నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చింతకాని మండలంతో పాటు కార్పోరేషన్‌లోని పలు ప్రాంతాలను కలుపుతూ వెళ్లే ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. నాసిరకం నిర్మాణాలకు పాల్పడిన గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ కూలిన విద్యుత్ స్తంభాలు, నాసిరకం నిర్మాణాల గురించి విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకుపోవడంతో డిఈ రామారావు క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. దీనికి సంబంధించి విచారణ జరిపి ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

# కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాపక్షం/ములకలపల్లి: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ములకలపల్లి మండల కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా ఖండించింది. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు ఎండీ జాహిరుద్దీన్ మాట్లాడుతూ ప్రజల మద్దతుతో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక కేటీఆర్ నిరాధార విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పొందుతోందని, నిరాధార ఆరోపణలు మానుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ మండల అధ్యక్షుడు పెటేటి నరసింహారావు, అశ్వారావుపేట నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలకుర్తి సుమిత్, సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల అవినాష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పాలకుర్తి రవి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎస్‌కే జాని, పోగలపల్లి గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి సాధం శ్రీనివాస్, నాయకులు దానియేలు, భాస్కర్, నవీన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# లేఔట్ అనుమతుల్లో నిబంధనలు పాటించాలి

## -లేఔట్ కమిటీ సమావేశంలో కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలను కట్టుదిట్టంగా పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న లేఔట్ అనుమతులపై కలెక్టర్ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి ప్రతి లేఔట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లేఔట్ అనుమతులకు వచ్చిన 17 దరఖాస్తులను కమిటీ పరిశీలించిందన్నారు. లేఔట్ అనుమతులను మంజూరు చేసే సమయంలో తప్పనిసరిగా ఎటువంటి వాటర్ బాడి ఎస్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలో రాకుండా జాగ్రత్తపడాలన్నారు. లేఔట్ అప్రోచ్ రోడ్డు 18 మీటర్లు ఉండాలన్నారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన మేర భూమి లేఔట్‌లో కేటాయింపులు జరిగేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ఎస్‌డిసి సదానందం, ఇరిగేషన్ సిఇ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బి ఎస్ఈ యాకోబు, పిఆర్‌విఎస్ఈ వెంకటరెడ్డి, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆర్డీఓ



ప్రజాపక్షం/చుంచుపల్లి: మండలంలోని ప్రశాంతినగర్ రైతువేదికలో బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం రెవెన్యూ డివిజనల్ అధికారి మధు, కొత్తగూడెం నియోజకవర్గ ఈఆర్ఓలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు విధానం, ఇంటింటి సర్వే, ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై బిఎల్ఓలు, బిఎల్ఎలకు పలు సూచనలు చేశారు. ఇంటింటి గణన 25.062026 నుండి 24.07.2026 వరకు జరుగుతుందని, ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ 31.07.2026న మరియు అభ్యంతరాల పరిష్కారానికి 31.07.2026 నుండి 31.08.2026 వరకు కాల వ్యవధి నిర్దేశించినట్లు తెలిపారు. ది.01.10.2026న తుది ఓటర్ల జాబితా ప్రచురణ జరిగే విధంగా కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, మండల రెవిన్యూ సిబ్బంది, బిఎల్ఓలు, బిఎల్ఏలు మరియు ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**- ఎంఎల్ఎ కూనంనేని**
**- ఇండ్ల స్థలాలపై పలుమార్లు సిఎంకు విన్నవించా..**
**- పండుగ వాతావరణంలో నూతన ప్రెస్‌క్లబ్ ప్రారంభం**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు.కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన కొత్తగూడెం ప్రెస్‌క్లబ్‌ను మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ఎంఎల్ఎ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇప్పించే విషయంపై ఇప్పటికే పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడినట్లు తెలిపారు. జర్నలిస్టులు సమాజాభివృద్ధికి తమవంతు పాత్రను పోషించాలన్నారు. జర్నలిస్టుల కోసం కొత్తగూడెం పది ఎకరాల ఇండ్ల స్థలాన్ని ఇతరత్రా వాటికి కేటాయించకుండా కాపాడుతున్నామని చెప్పారు. మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు తాము ఎప్పటికీ అండగా ఉంటామని, నగరంలో సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా మాట్లాడుతూ జర్నలిస్టులకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్ల



స్థలాలు ఇవ్వకుండా హామీతోనే కాలం వెల్లబుచ్చిందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇండ్ల స్థలాల విషయంలో జాప్యం చేస్తుండటం బాధాకరమన్నారు. ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవంలో వెలుగు రిపోర్టర్ కీలక భూమిక పోషించడం అభినందనీయం అన్నారు. అనంతరం ఎంఎల్ఏకు షాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టియూడబ్ల్యూజే ఐజేసి జిల్లా కార్యదర్శి జునుమాల రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు నవీన్, పాత్రికేయులు పోతు రాజేందర్, లోగాని శ్రీనివాస్, ఇమంది ఉదయ్ కుమార్, పి.సత్య ఆనంద్, ఎర్రా ఈశ్వర్, కల్లోజి శ్రీనివాస్, మోటమర్రి రామకృష్ణ, శంకర్, లక్ష్మ ణ్, అఫ్జల్, గోవింద్, కాగితపు వెంకటేశ్వర్లు, నర్సింహా, పండుగ రేశ్వత్, రవి, రాజేష్, కుమార్, నాగాచారి, భాస్కర్, సురేష్, పూర్ణ, పాపారావు, రాజేష్, కృష్ణారావు, సుధాకర్, శ్రీనివాస్, షఫి, ఉమాకాంత్, ప్రసాద్, బిజేపి నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మెజిస్ట్రేట్ రాజమల్లు, డిఎస్‌పి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

**- సఫారి వాహనాలను ప్రారంభించిన ఎంఎల్ఏ**

**ప్రజాపక్షం/పాల్వంచ :** భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించటానికి పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు బాధ్యతగా పాటు పడాలని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో పర్యాటక, అటవీ శాఖల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సఫారీ వాహనాలు, ట్రెకింగ్ ట్రాక్, సీతాకోక చిలుకల పార్క్‌లను గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. ఎంఎల్ఏ కూనంనేని హాయరయ్యారు. పచ్చదనం, అడవుల సంరక్షణపై సిఎం తన సందేశాన్ని వినిపించారు. ఈ సంధర్భంగా కిన్నెరసాని వైల్డ్ లైఫ్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ బాబు అద్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలన్నారు. జిల్లాలోని పుణ్య క్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామచంద్రాస్వామి ఆలయం, సీతారాములు వనవాసం చేసిన పర్ణశాలతో పాటు పర్యాటకులు విహార యాత్ర చేసేందుకు గల పాపికొండలు కొండలు, వాటికి కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని అనుసంధానం చేసి అభివృద్ధి చేస్తే పెద్ద ఎత్తున ఆదాయంతో పాటుగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా అటవీ అధికారి క్రిష్ణాగౌడ్, డిఆర్‌డిఏ విద్యాచందన, కిన్నెరసాని రేంజర్ కవితా మాధురి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, కిన్నెరసాని సర్పంచ్ వజ్జా క్రిష్ణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాయకులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, నిమ్మల రాంబాబు, అటవీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆధునీకరణతో రాతి చెరువు రూపురేఖలు మారుతాయి..

**- ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు**
**- రూ.2.76 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**ప్రజాపక్షం/పాల్వంచ :** రూ.2.30 కోట్ల నిధులతో చేపట్టనున్న రాతి చెరువు ఆధునీకరణతో చెరువు రూపురేఖలు మారుతాయని, రాతి చెరువు పరిసరాలు ఎంతో ఆహ్లాదంగా తయారవుతాయని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో రూ.2.30 కోట్లతో చేపట్టనున్న రాతిచెరువు అభివృద్ధిపనులకు, రూ.76 లక్షలతో నిర్మించనున్న రెండు నూతన రోడ్ల నిర్మాణ పనులకు గురువారం ఆయన ముఖ్యాతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. రాతి చెరువు సుందరీకరణ పనులు, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, ఇతర ఆధునీకరణ పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. అభివృద్ధికి చిరునామాగా నియోజకవర్గ పరిధిలోని పాల్వంచను తీర్చిదిద్దుతామని, ముమ్మరంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయని వివరించారు. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారమే ధేయ్యంగా తాము నిరంతర కృషి చేస్తున్నామని, నియోజకవర్గ పరిధిలో ప్రజా సంక్షేమమే ధేయ్యంగా మరిన్ని నిధులు



తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా పూర్తి నాణ్యతా ప్రమామాణాలతో నిర్ణీత కాలవ్యవధిలోగా పనులు ముంగించే విధంగా చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఎంఎల్ఏ ఆదేశించారు. భవిష్యత్‌లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ప్రతీ పల్లెకు, బస్తీకి మౌళిక వసతులు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యుటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్ తహశిల్దార్ దారా ప్రసాద్ ఇంచార్జ్ కమీషనర్ విజయానంద్ ఎలక్ట్రికల్ ఏడిఇ అబ్దుల్ రెహమాన్ కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వర రావు గుర్రం వెంకటేశ్వర్లు నామా కీర్తి గొర్లె అన్నపూర్ణ కాల్వ భాస్కర్ దున్నపోతుల మణి దంతబోయిన నరేష్‌తో పాటు వి పద్మజ డి సుధాకర్ అన్నారపు వెంకటేశ్వర్లు నిమ్మల రాంబాబు శెనగారపు శ్రీనివాసరావు ఏస్ఏ రెహమాన్ వైఎస్ గిరి గౌస్ పాషా మస్తాన్ అహ్మద్ జానీ కరీం గొర్లె నరేష్ నామ పండు ఆలపాటి ప్రసాద్ అల్లి వెంకటేశ్వర్లు వివిధ శాఖల డిఇలు ఏఇలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో జర్నలిస్టుల ధర్నా

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నియోజకవర్గ కేంద్ర ఆర్‌సీ ఇన్‌చార్జ్‌లకు మండల స్థాయి అక్రిడేషన్ కార్డులు, జిల్లా బస్సు పాసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ యూనియన్లకు అతీతంగా సత్తుపల్లికి చెందిన జర్నలిస్టులు గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కు వినతిపత్రం అందజేసి, గతంలో అమలులో ఉన్న విధానంలోనే అక్రిడేషన్ కార్డులు, బస్సు పాసులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి అందే శాశ్వత ప్రయోజనాలైన అక్రిడేషన్ కార్డులు, బస్సు పాసుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరైంది కాదని విమర్శించారు. బ్యూరోలు, డెస్క్ జర్నలిస్టులు, మండల విలేకరులను వేర్వేరుగా విభజించి, కార్డుల రంగుల్లోనూ తేడాలు చూపడం తగదన్నారు. జీవో నెం.252 జర్నలిస్టుల మధ్య చిచ్చు పెట్టిందని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను అనేక విధాలుగా విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న జర్నలిస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కొన్ని జర్నలిస్టు సంఘాలు కూడా ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న విలేకరులకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. జర్నలిస్టులకు లభిస్తున్న ఏకైక రాయితీ అయిన బస్సు పాసులను కూడా పూర్తిస్థాయిలో ఇవ్వకుండా నిరోధించడం సమంజసం కాద



న్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో ముందుండాల్సిన సంఘాలు ప్రశ్నించే ధైర్యం చూపకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. గత 15 నుంచి 20 ఏళ్లుగా అమలులో ఉన్న విధానాన్ని కొనసాగిస్తూ నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న పత్రికల ఆర్‌సీ ఇన్‌చార్జ్‌లకు గుర్తింపు కల్పించి, జిల్లా అక్రిడేషన్‌తో పాటు రాష్ట్ర స్థాయి బస్సు పాసులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు న్యాయం జరగని పక్షంలో హక్కుల కోసం మరింత ఉధృతంగా పోరాటం చేస్తామని, అవసరమైతే యూనియన్ల నుంచి వైదొలగడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు లుమాదిరాజు సుధాకర్, భీమిశెట్టి రాము, ఎండి షైబుద్దిన్, చీనేని బాలకృష్ణ, ఎస్కే ఖాదర్ బాబా, తోట కిరణ్, రామిశెట్టి లక్ష్మ ణరావు, తడికమల్ల దేవదానం, నిమ్మగడ్డ శ్రీకాంత్, రాజేష్ రెడ్డి, ఐ శ్రీను, ఆనంద్, జె శ్రీనివాస్, మోహన్, రామారావు, సురేష్, మెహరాజ్, సుధాకర్, గురవయ్య, రామకృష్ణ, గంగాధర్, రాంబాబు, అశోక్, చిరంజీవి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శంగా ఖమ్మం నగరం

**-ఖమ్మంలో పర్యటించిన ధర్మపురి మున్సిపల్ బృందం**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, అభివృద్ధి ఆదర్శంగా నిలుస్తున్నాయని ధర్మపురి మున్సిపల్ ఛైర్‌పర్సన్ వి. నాగలక్ష్మి తెలిపారు. గురువారం ధర్మపురి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ వి. నాగలక్ష్మి నేతృత్వంలో పాలకవర్గ సభ్యులు, అధికారుల బృందం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో పర్యటించారు. ఖమ్మం నగరంలో జరుగుతున్న ప్రగతిని పరిశీలించారు. ఘన వ్యర్థాల నిర్వహణ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. 54వ డివిజన్‌లో ప్రారంభించిన ఎన్‌టిఆర్ పార్కును, ఎన్నెస్పి రోడ్డులో నర్సరీని సందర్శించారు. అక్కడ మొక్కల పెంపకానికి తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డులను, డిఆర్‌సిసి కేంద్రాలను సందర్శించారు. సేకరించిన చెత్తను ఎలా డిస్పోజ్ చేస్తున్నారు రిసైక్లింగ్‌ను పరిశీలించారు. బయో మైనింగ్ ప్రాసెస్‌ను పరిశీలించారు. బయో మైనింగ్ ప్రాంతంలో పది ఎకరాల విస్తీర్ణంలో నాటిన మొక్కలను పరిశీలించారు. మిర్చి మార్కెట్, లకారం చెరువును సందర్శించారు. ఈసందర్భంగా ఛైర్‌పర్సన్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఖమ్మం నగరంలో చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా పారిశుధ్యానికి సంబంధించి సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేపట్టే విధానం బాగుందన్నారు. అదేవిధంగా నగర వ్యాప్తంగా పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తున్నారని తెలిపారు. రూ. 250 కోట్లతో మార్కెట్ అభివృద్ధితో పాటు పర్యాటక ప్రాంతంగా లకారం అద్భుతంగా ఉందన్నారు. ఖమ్మం నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ధర్మపురి మున్సిపాలిటీలో కూడా చేపడతామని అందుకే ఖమ్మం నగరంలో పర్యటించామన్నారు. మాజీ మేయర్ నీరజ, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఆర్టి కల్చర్ అధికారిణి బెల్లం రాధిక, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు తదితరులు ధర్మపురి మున్సిపాలిటీ బృందాన్ని క్షేత్రస్థాయిలో కార్యక్రమాల గురించి వివరించారు.

# రాజకీయ లబ్ధికోసమే పొంగులేటిపై విమర్శలు



**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** రాజకీయ లబ్ధి కోసమే మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై విమర్శలు చేస్తున్నారని మున్సిపల్ వైస్ ఛైర్మన్ జూపల్లి రమేశ్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి ఆరోపణల నుంచి దృష్టి మరల్చేందుకే నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ప్రజల నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని దూరం చేయడం కేసీఆర్‌కు సాధ్యం కాదన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న పొంగులేటిని విమర్శిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, ఆత్మ కమిటీ ఛైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, జిల్లా నాయకులు తుమ్మ రాంబాబు, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# లాడ్జీలు..హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నేరాల నియంత్రణ, భద్రతా చర్యల్లో భాగంగా గురువారం ఖమ్మం అర్బన్ మండలంలోని వివిధ లాడ్జీలు, హోటళ్లపై ఖానాపురం హవేలీ సిఐ భానుప్రకాశ్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. గుర్తింపు పత్రాలు, రిజిస్టర్ ఎంట్రీలు, సిసి కెమెరాల పనితీరు, చెక్‌ఇన్ చెక్ అవుట్ సమయాలను పరిశీలించారు. లాడ్జీలలో బస చేసే వారికి సంబంధించిన గుర్తింపు కార్డులను తీసుకొని వాటిని భద్రపరచాలని నిర్వాహకులు, యజమానులకు ఈసందర్భంగా సిఐ సూచించారు. సరైన గుర్తింపు లేకుండా ఎవరికి గదులు కేటాయించవద్దని అదేవిధంగా ప్రవేశద్వారంలో హెచ్‌డి క్వాలిటీ ఉన్న సిసి కెమెరాలను అమర్చి అన్నివేళలా అవి పనిచేసేలా చూడటం యజమానుల బాధ్యత అన్నారు. లాడ్జీలలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు లేదా అసాధారణ కార్యాకలాపాలకు పాల్పడుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. భద్రతా ప్రమాణాలతో పాటు రికార్డుల నిర్వహణలో లోపాలు జరిగితే యజమానులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ భానుప్రకాశ్ హెచ్చరించారు. అదేవిధంగా బల్లెపల్లి గణేష్ టౌన్‌షిప్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు.